ప్రజాశక్తి
శనివారం 5 అక్టోబర్ 2024 5
శ్రీ సత్యసాయి

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

పండగ పూటా పస్తులుండాల్సిందేనా..?

'శ్రీరామిరెడ్డి' కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి
సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు
డిసిఎల్ కు సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లా ప్రజలకు తాగునీటి సరఫరా చేస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందరిని పరిస్థితి ఉందని దసరా పండగ పూట కూడా వారు పస్తులు ఉండాల్సిందేనా అని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు అధికారులను ప్రశ్నించారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు బకాయి వేతనాలు ఇవ్వాలన్న డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ కు సిఐటియు నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి వాటర్ సప్లై కార్మికులకు ఏడు నెలల బకాయి వేతనాలు, 12 నెలల పీఎఫ్ బకాయి చెల్లించాల్సి ఉందన్నారు. వారి సమస్యలపై సెప్టెంబర్ ఐదు నుంచి 17 వరకు కార్మికుల సమ్మె చేశారని, 17వ తేదీ కలెక్టర్ జోక్యం చేసుకొని హామీ ఇవ్వడంతో సమ్మె వాయిదా వేశామని అన్నారు. అయితే 18 రోజులైనా వేతనాలు వేయకపోవడం సమస్య పరిష్కారం కాకపోవడంతో సెప్టెంబర్ 30 నుంచి తిరిగి కార్మికులు సమ్మె చేస్తున్నారన్నారు. ఈ సమ్మెను పోలీసుల ద్వారా పరిష్కారం చేసుకోవాలని ప్రయత్నాలు చేయడం సరైంది కాదన్నారు. కార్మికులకు బకాయిలు ఇవ్వవలసిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పండుగ రోజులలో కూడా కార్మికులు పస్తులు ఉండాల్సి వస్తుందని .దీనికి కారణం ప్రభుత్వ నిర్వాకమేనని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వాటర్ సప్లై కార్మికులకు బకాయి వేతనాలు పిఎఫ్ చెల్లించి సమ్మె విరమింప జేయాలని దీనిపై లేబర్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'పురం' ఇఎస్ఐ ఆసుపత్రికి అనారోగ్యం

వైద్యులు లేరు.. మందులూ లేవు...
మూడేళ్లుగా మూత పడిన ల్యాబ్
406 రకాల మందులు రావాల్సుంటే వచ్చింది 50 రకాలే
కార్మికులకు భారంగా మారిన వైద్యం

కార్మికులకు ఎంతో అండగా నిలవాల్సిన హిందూపురం ఇఎస్ఐ అసుపత్రి అనారోగ్యం పాలైంది. ఇక్కడ వైద్యులే కాదు...మందులు సైతం ఉండవు. టెక్నిషియన్ ఉన్నా అవసరమైన కెమికల్స్, కిట్స్ సరఫరా చేయక పోవడంతో మూడేళ్లుగా ల్యాబ్ మూత పడింది. 406 రకాల మందులు పంపిణీ చేయాల్సి ఉంటే కేవలం 50 రకాల మందులు మాత్రమే సరఫరా చేస్తున్నారు. పోనీ వైద్యులు ఉన్నారా అంటే అదీ లేదు. ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉండాల్సుండగా ఇద్దరూ లేరు. మదనపల్లి నుంచి ఇక్కడికి ఒక వైద్యుడుని డిప్యూటేషన్‌పై నియమించారు. ఆయన వారంలో ఒక రోజు అలా వచ్చి ఇలా వెళ్లి పోతున్నారు. ఉన్న నర్సింగ్ సిబ్బంది వచ్చే రోగులను పరీక్షించి ఉన్న మందులను ఇస్తున్నారు. ఇక దీర్ఘ కాలిక రోగుల పరిస్థితి అయితే మరీ ఘోరంగా ఉంది.బిపి కోసం 8 రకాల మందులు రావాల్సి ఉంటే 2 రకాలు, షుగర్ కోసం 6 రకాల మాత్రలు రావాల్సి ఉంటే మూడు రకాలు మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఇవి కూడా వైద్య సిబ్బంది ఒకటికి పది సార్లు ఇండెంట్ పెట్టి కార్మికులు తమపై తిరగబడుతున్నారని అధికారులకు విన్నవిస్తే ఈ మందులను పంపిణీ చేస్తున్నారు. ఒత్తిడి చేయక పోతే వచ్చే ఈ మందులు సైతం పంపిణీ చేసే స్థితి లేదు. దీంతో అవసరమైన మందులు అందక కార్మికులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. వ్యాధులు నయం చేసుకునేందుకు బయట మార్కెట్‌లో మందులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురంతో పాటు హిందూపురంలో రెండు, గుంతకల్లు, తాడిపత్రిలో ఒక్కో ఇఎస్ఐ ఆస్పత్రులు ఉన్నాయి. హిందూపురంలో రోజూ సుమారు 500లకు పైగా కార్మికులు వైద్య సేవల కోసం వస్తుంటారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా హిందూపురం ఈఎస్ఐ అసుపత్రిలో ఎక్కువ మంది వస్తుంటారు. హిందూపురం ప్రాంతంలో దాదాపు 20 వేల మందికి పైగా కార్మికులున్నారు. ఒక్కో కుటుంబంలో నలుగురు సభ్యులను కలుపుకుంటే మొత్తం సభ్యుల సంఖ్య సుమారు 80వేలకు చేరుకుంటుంది. వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆయా సంస్థలు తమ ఇఎస్ఐ వాటాను ప్రభుత్వానికి ప్రతి నెలా చెల్లిస్తున్నాయి. కార్మికుల కుటుంబ సభ్యులకు ఇఎస్ఐ డిస్పెన్సరీ, ప్యానెల్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తుంటారు. కడప, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, అనంతపురానికి ఇఎస్ఐ జాయింట్ ప్రాంతీయ కార్యాలయం కడపలో ఉంది. 28 డిస్పెన్సరీలు, ఆదోని, తిరుపతిలో ఆస్పత్రులు, నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నాయి. వైద్యుల లెక్క ప్రకారం ఆస్పత్రులు, డిస్పెన్సరీలకు ఒక్కో దానికి రోజుకు 100 నుంచి 150 మంది ఇఎస్ఐ కార్డు కలిగిన కార్మికులు చికిత్స కోసం వస్తుంటారు. డిస్పెన్సరీలకు అవసరమైన మందుల ఇండెంట్‌ను కడప జేడీ కార్యాలయం నుంచే విజయవాడ కార్యాలయానికి పంపిస్తుంటారు. ఏయే మందులు అవసరమో వాటిని అక్కడి నుంచి డిస్పెన్సరీలకు సరఫరా చేస్తారు. హిందూపురంలో పాటు అనంతపురం, కర్నూల్, కడప జిల్లాలకు ఆదోనిలో ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మందులు సరఫరా అవుతాయి. అయితే గత మూడు సంవత్సరాలుగా పూర్తి స్థాయిలో మందులు సరఫరా కావడం లేదు.

మందుల కొరత

ప్రభుత్వం మందులు సరఫరా చేసే కంపెనీలకు బకాయిలు చెల్లించకపోవటంతో ఆ కంపెనీలు ఇఎస్ఐ ఆస్పత్రులకు అవసరమైన మందులను సరఫరా చేయడం లేదని తెలుస్తోంది. మూడు నెలలకు ఓ సారి ఆస్పత్రులకు అవసరమైన మందుల ఇండెంట్‌ను జేడీ ద్వారా విజయవాడలోని డైరెక్టర్‌కు పంపిస్తుంటారు. 406 రకాల మందులకు డాక్టర్లు ఇండెంట్ పెడుతుంటారు. దీర్ఘకాలిక వ్యాధుల మందులతో పాటు బీపీ, షుగర్, లివర్, కిడ్నీ, గుండె సంబంధిత తదితర వ్యాధులకు సంబంధించి మందులు తెప్పిస్తుంటారు. అయితే ప్రభుత్వం కంపెనీలకు పాత బకాయిలు ఇవ్వకపోవడంతో మందుల సరఫరా నిలిచిపోయినట్లు సమాచారం. 406 రకాల మందులకు గాను ఇప్పుడు కేవలం 50 రకాలు మాత్రమే వస్తున్నాయి. కార్మికులు నిత్యం వాడే బిపి, షుగర్, థైరాయిడ్ లాంటి రోగాలకు సైతం పూర్తి స్థాయిలో మందులు రావడం లేదు.

మూడేళ్లుగా మూత పడ్డ ల్యాబ్

హిందూపురం ఇఎస్ఐ అసుపత్రిలో ఉన్నా రక్త పరీక్షల విభాగంలో టెక్నిషియన్ ఉన్నారు. అయితే ల్యాబ్‌కు అవసరమైన కెమికల్స్, కిట్స్ సరఫరా చేయక పోవడంతో ల్యాబ్ మూడేళ్లుగా మూత పడింది. గతంలో అధునాతన యంత్రాలతో దాదాపు 20 రకాల రక్త పరీక్షలు నిర్వహించే వారు. అయితే ప్రస్తుతం హెచ్‌బి పరీక్ష మాత్రమే చేస్తున్నారు. రోగ నిర్ధారణ అయిన అనంతరమే వైద్యులు రోగులకు వైద్య సేవలను అందిస్తారు. అయితే రోగ నిర్ధారణ కోసం కార్మికులు వేలాది రూపాయలు చెల్లించి బయట ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకుని వచ్చినా వైద్యులు లేక పోవడంతో ఇక్కడ వైద్యం అందడం లేదు.

ఇఎస్ఐ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు (ఫైల్‌ఫోటో)

మందులే కాదు సిబ్బందీ లేరు...

హిందూపురం ఇఎస్ఐ అసుపత్రిలో ముందులే కొరతే కాదు సిబ్బంది కొరత సైతం వేధిస్తోంది. హిందూపురం, కొట్నూరు రెండు డిస్పెన్సరీలు ఒకే చోట నిర్వహిస్తున్నారు. కనీసం ఇద్దరు వైద్యులు ఉండాలి. ఇందులో ఒక్కరు కూడా లేరు. ఇక నర్సింగ్, ల్యాబ్ టెక్నిషియన్, ఎంఎన్‌ఓతో పాటు క్లాస్-4కు సంబంధించిన అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు కార్యాలయంలో ఉండాల్సిన సీనియర్ అసిస్టెంట్‌లు సైతం లేరు. దీంతో రోగులతో పాటు వైద్యులు సైతం ఇబ్బంది పడుతున్నారు.

కార్మికులకు భారంగా వైద్యం...

చాలా మంది కార్మికులు అరకొర వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఏదైనా జబ్బుచేస్తే ఇఎస్ఐ కార్డుతో చికిత్స చేయించుకోవచ్చనే భరోసా కార్మిక కుటుంబాలకు ఉంటుంది. కార్మికులతో పాటు పిల్లలు, తల్లిదండ్రులకు ఉపయోగంగా ఉండేది. అయితే ఇఎస్ఐ డిస్పెన్సరీలో కూడా మందులు కొరత ఉండడం కార్మికులను కలవరపాటుకు గురిచేస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు సుమారు రూ.2 వేల నుంచి 3 వేల రూపాయల విలువ చేసే మందులను ఉపయోగిస్తుంటారు. వీరు క్రమం తప్పకుండా రోజూ మందులు వేసుకోవాల్సి ఉంది. అయితే ఇప్పుడు ఇఎస్ఐలో మందుల కొరత కారణంగా బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిరావడం కార్మికుల కుటుంబాలకు భారంగా మారుతోంది. ఇక్కడ సరైన వైద్యం అందక పోవడంతో ఇతర అసుపత్రుల్లో వైద్య సేవలు పొందితే దానికి సంబందించిన బిల్లులు ఆరు నెలలు గడిచిన మంజూరు కావడం లేదు. ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ అసుపత్రుల్లో ఇఎస్ఐ కార్డు ఉన్నా వారికి వైద్య సేవలు అందించమని తెగేసి చెబుతున్నట్లు కార్మికులు చెబుతున్నారు. దీనికి కారణం ఇఎస్ఐ వైద్య సేవలకు సంబందించి సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడమేనని తెలుస్తోంది. ప్రతి నెలా కార్మికులు ఇఎస్ఐ కోసం డబ్బులు చెల్లించినప్పటికి వైద్య సేవల కోసం అప్పులు చేసి, ఆ భారాన్ని మోయాల్సి వస్తోంది.

సౌకర్యాలు మెరుగు పర్చాలి

జిల్లాలో కార్మికుల కోసం ఉండే ఒకే ఒక అసుపత్రి ఇఎస్ఐ అసుపత్రి. ఈ అసుపత్రిలో మందులే కాదు వైద్యులు, సిబ్బంది సైతం లేకపోవటంతో కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదు. వెంటనే పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి అవసరమైన మందులను సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. రక్త పరీక్షల కోసం అవసరమైన కెమికల్స్, కిట్స్‌ను సరఫరా చేసి ల్యాబ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి. ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. లేని పక్షంలో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతాం.

ఇఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : ఎంపీ అంబికా

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. విజయవాడలోని బిఆర్‌టిఎస్ రోడ్ లోని సత్యనారాయణపురంలో ఉన్న ఎలక్ట్రికల్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే ఆధ్వర్యంలో నిర్వహించిన పార్లమెంట్ సభ్యుల సమావేశంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా గుంతకల్లు రైల్వే డివిజన్, అనంతపురం జిల్లాలోని రైల్వే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ఏ పనులు పూర్తిస్థాయిలో నిర్వహించలేదని చెప్పారు. నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రైల్వే పనులను, సమస్యలను పరిష్కరిస్తామని, ఎన్డీఏ ప్రభుత్వంలో అందరి భాగస్వామ్యంతో రైల్వే పనులను పూర్తి చేస్తామని తెలియజేశారు. విజయవాడ తర్వాత అనంతపురం జిల్లా గుంతకల్ డివిజన్ అభివృద్ధి అవుతోందని చెప్పారు. ప్రజల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని ప్యాసింజర్ రైళ్లను నడపాలని, అలాగే ఉన్న ప్యాసింజర్ రైళ్లకు మూడు నాలుగు బోగీలను అనుసంధానం చేయాలని కోరారు. ప్రస్తుతం మచిలీపట్నం నుంచి అనంతపురం మీదుగా బెంగళూరుకు నడుస్తున్న కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను ప్రతిరోజు నడపాలని కోరారు. బెంగళూరు నుంచి పుట్టపర్తి వరకు ఉన్న ప్యాసింజర్‌ను అనంతపురానికి నడపాలన్నారు. బెంగళూరు నుంచి ఢిల్లీకి నడుపుతున్న రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు అనంతపురంలో స్టాపింగ్ ఇవ్వాలని కోరారు. బెంగళూరు నుంచి కాచిగూడకి నడుపుతున్న వందే భారత్‌ను హిందూపురంలో స్టాపింగ్ ఇవ్వాలన్నారు. గుంతకల్ డివిజన్‌లో అండర్ ప్రాసెస్ త్వరగా పూర్తి చేయాలని కోరారు. రైల్వే ప్రొటెక్షన్‌లో భాగంగా మహిళలు, ఇతర ప్యాసింజర్లు తమ గమ్యస్థానం చేరేవరకు రైల్వేలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. రైల్వేకి సంబంధించినటువంటి నిర్మాణాలు పూర్తి నిధులను ఇప్పించాలని, ఇందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీలు సిఎం రమేష్ ఆధ్వర్యంలో కృషి చేయాలని విన్నవించారు. ఈ సమావేశంలో బెజవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లలోని ఎంపీలు, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్, సౌత్ సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారులు, డిజిఎంలు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపుదాం : మంత్రి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని అన్ని వనరులను సద్వినియోగం చేసుకుని సత్యసాయి జిల్లాను అభివృద్ధిలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుపుదామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర 2047 జిల్లా విజన్ ప్లాన్ జిల్లా స్థాయి సమావేశం స్థానిక సాయి ఆరామంలో శుక్రవారం నిర్వహించారు. మంత్రి ముఖ్యఅతిథిగా హాజరైన ఈ సమావేశంలో పుట్టపర్తి, కదిరి, శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, కలెక్టర్ టీఎస్ చేతన్, సిపిఓ విజయ్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీని దేశంలోనే అభివృద్ధిలో అగ్రస్థానం లో నిలపాలని పనిచేస్తున్నారనిఅందులో భాగంగానే జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ అందించాలని ఆదేశించారని చెప్పారు. సిఎం ఆలోచనకు అనుగుణంగా అధికారులు ప్రజా ప్రతినిధులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గాల వారిగా అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి యాక్షన్ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో ఉద్యానవనాలు, వ్యవసాయం, పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉందని, అన్ని వనరులు ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి బాటలో జిల్లాను నిలుపవచ్చని అన్నారు. సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నో విలువైన సలహాలు అందజేశారని వాటిని నమోదు చేసుకున్నామని క్షేత్రస్థాయిలో కూడా నియోజకవర్గాల వారీగా యాక్షన్ ప్లాన్ పక్కగా రూపొందించాలని అన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ జిల్లాతో పాటు రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందడానికి కొత్త టెక్నాలజీని వినియోగించుకొని 2047 ప్రణాళికలు రూపొందించాలన్నారు. అందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి అందరం కష్టపడి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. సుదీర్ఘ వ్యవసాయం, పర్యావరణ సమతుల్యం, మహిళా సాధికారిత, బలహీనవర్గాల అభివృద్ధి తదితర అంశాలపై ప్రణాళికలలో చర్చాలన్నారు. కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ జిల్లాలోని కీలక రంగాలపై దృష్టి సారించి జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. మండల స్థాయి నుంచే యాక్షన్ ప్లాన్ ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర సహకారంతో చేనేతల అభివృద్ధి : చేనేత కార్మికులకు అన్ని విధాల అండగా నిలవాలని సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చిత్తశుద్ధితో ఉన్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. శుక్రవారం సాయి ఆరామం లో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశానికి హాజరైన మంత్రి అక్కడికి వచ్చిన చేనేతలతో మాట్లాడారు. గతంలో మాదిరి నూలుపై సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చేనేత పై జి ఎస్ టి మినహాయించాలని త్వరలో ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తెస్తామన్నారు. కేంద్రం ముందుకు రాకపోతే రాష్ట్ర ప్రభుత్వమే చేనేతపై జిఎస్‌టి భరించడానికి సిద్ధంగా ఉందన్నారు. చేనేత వస్త్రాలపై మార్కెటింగ్ సదుపాయం ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. చేనేతలు మరింత నైపుణ్యం పెంపొందించుకోవడానికి అవసరమైన శిక్షణలు ఇప్పిస్తామన్నారు. ఖాదీ బోర్డు ద్వారా చేనేతలకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. అటు కేంద్రం ఇటు రాష్ట్ర ప్రభుత్వం చేనేతల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాయన్నారు.

తూమకుంట చెక్‌పోస్టు వద్ద నరికివేసిన చెట్లు

అడ్డం ఉన్నాయని అడ్డంగా నరికేశారు..

ప్రజాశక్తి - హిందూపురం

మొక్కలు నాటలేదు... నాటిన మొక్కను పెంచలేదు... ఎవరో నాటిన మొక్క పెరిగి పెద్దదైంది.... ఆ వృక్షాలను కాపాడాల్సిన అధికారులు రోడ్డుకు అడ్డుగా ఉన్నాయని ఆర్అండ్‌బి అధికారులు అడ్డంగా నరికేశారు. హిందూపురం రూరల్ మండలం తూముకుంటలో నెలకొన్న ఈఘటన వివరాలు...

గతంలో ఉన్న అధికారులు రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటి, వాటిని సంరక్షించారు. ఈ చెట్లు పెరగడం వల్ల రోడ్డు మన్నికతో పాటు ఆ రహదారుల్లో ప్రయాణించే వారు ఉపశమనం పొందారు. అంతేకాకుండా ఈ చింత ఫలాల వల్ల ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తోంది. గతంలో ఉన్న అధికారులు ఈ విధంగా రోడ్డు మన్నికతో పాటు ప్రభుత్వానికి ఆదాయాన్ని సైతం పెంచారు. అయితే ప్రస్తుత అధికారులకు ఇలాంటివి ఏమీ అవసరం లేదు. రోడ్డు, భవనాల శాఖలో పనిచేస్తున్న ఇంజనీర్లకు ఆదాయం తగ్గిందేమో తెలియదు గాని రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని చెట్టు కొమ్మలు నరకడం మాని ఏకంగా చెట్లనే నరికారు. నిబంధనల మేరకు చూస్తే రోడ్డు భవనాల శాఖల ఆధీనంలో ఉన్న చెట్లు ఏవైనా ఎండిపోతే వాటిని తొలగించాంటే అటవీ శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలి. ఆ చెట్టు ఎంత విలువ చేస్తుందని లెక్కలు వేయించి, అటవీ శాఖ అధికారులు, రోడ్డు భవనాల శాఖ అధికారులు సమన్వయంతో బహిరంగ వేలం వేసి ఎక్కువ పాటదారుడికి ఆ చెట్టును నరుక్కోవడానికి అనుమతులు ఇవ్వాలి. అయితే ఇలాంటివి ఏమీ పాటించకుండా ఆర్ అండ్ బి శాఖ అధికారులు తూముకుంట చెక్ పోస్ట్ వద్ద ఏకంగా తొమ్మిది చింత చెట్లను అడ్డంగా నరికారు. ఇప్పటికే తూముకుంట, గోవాపురం పారిశ్రామిక వాడలో ఉన్న పలు పరిశ్రమలు వారు వాడే బాయిలర్‌లో పచ్చని కలపను వాడుతున్నారు. ఆ పరిశ్రమలకు సరఫరా చేయడానికి కొంతమంది పచ్చని చెట్లను నరికి, ఆ పరిశ్రమలకు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయాలను అటవీశాఖ అధికారులకు తెలిసినప్పటికీ అవినీతికి అలవాటు పడిన కొందరు అధికారులు చూసి చూడకుండా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. చెట్లను సంరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలను తీసుకుని వచ్చినప్పటికీ అవి కార్యరూపం దాల్చడం లేదు. ఈ సంఘటనలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఎటువంటి అనుమతులు లేకుండా చెక్ పోస్ట్ లో చింత చెట్లు నరికిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణంలో విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, గ్రీన్ భారత్ ఫౌండేషన్ ఛైర్మన్ శంకర్ నారాయణ కలెక్టర్ టిఎస్ చేతన్‌కు విన్నవించారు. పట్టణంలోని సాయి ఆరామంలో శుక్రవారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-2047 జిల్లా విజన్ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్‌కు వారు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో స్థానిక ప్రజలతో పాటు దేశ విదేశాల భక్తులు ఇక్కడే నివాసం ఏర్పరచుకొని ఉంటున్నారన్నారు. ఇందులో ఎక్కువ శాతం వృద్ధులు, ఉన్నారని విద్యుత్ కోతల వల్ల ఇక్కడ పరిస్థితులకు అలవాటు పడేందుకు ఇబ్బందులు పడుతున్నా రన్నారు. ఈ సమస్యపై వెంటనే పరిష్కారం చూపాలని వారు కలెక్టర్‌ను కోరారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

హిందూపురం డివిజన్ పరిధిలోని తపాలా ఉద్యోగులు శుక్రవారం సహాయ నిరాకరణ నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామ డాక్ సేవక్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురు, శుక్ర, శనివారాల్లో విధులు బహిష్కరించి సబ్ పోస్ట్ ఆఫీసుల్లో నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్రం తపాలా శాఖను ప్రయివేటుపరం చేయడానికి సన్నాహాలు చేస్తుందని, ఇందులో భాగంగానే గ్రామీణ తపాలా ఉద్యోగులను టార్గెట్ల రూపంలో వేధిస్తుందన్నారు. పుట్టపర్తి, కొత్తచెరువు, గోరంట్ల సబ్‌పోస్టాఫీసుల ముందు ఎఐ జిడిఎస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్ర మంలో యూనియన్ నాయకులు అసిస్టెంట్ సెక్రటరీ ఎ.లక్ష్మీరాంనాయక్, శోభన్‌బాబు, వెంకటేశ్వర్లు, చంద్రబాబు, శివానాయక్, గణేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-నల్లచెరువు

భవన నిర్మాణ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు రామకృష్ణ డిమాండ్ చేశారు. నల్లచెరువులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ. 5 లక్షల ఇన్సూరెన్స్, అంగవైకల్యం కలిగితే రూ. 3 లక్షల ఇన్సూరెన్స్, తదితర హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, నాయకులు భాస్కర్, మురారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

'ఉచిత ఇసుక'ను తక్షణమే అమలు చేయాలి

సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈఎస్.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేస్తామని సిఎం చంద్రబాబు తెలిపారని, అయితే పింఛను పథకం మాత్రమే అమలు చేశారని మిగిలిన హామీలు మరిచారన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో కరోనా, ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. జగన్ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలతో పాటు నవరత్నాలు ముసుగులో నిధులను తప్పుదోవ పట్టించారన్నారు. దీంతో ప్రజలు ఆ ప్రభుత్వాన్ని సాగనంపారని తెలిపారు. ఈ ప్రభుత్వంలో ఇసుకను అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే అమలు చేయాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ నీలకంఠారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి అంజి, కార్యదర్శి ముత్యాలు, కోకన్వీనర్ శంకర్‌రెడ్డి, శ్రావణి, నాగమణి, రమేష్, సిద్దూ, సాకే వెంకటేష్, భవన నిర్మాణ సంఘం నాయకులు లక్ష్మన్న, రామంజి, నరసింహ పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా తక్షణమే ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్.నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 4 నెలలు అవుతున్నా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. వైసిపి ప్రభుత్వంలో ఇసుకను అధిక ధరకు అమ్ముకుని కార్మికుల పొట్ట కొట్టిందన్నారు. ఈ ప్రభుత్వం కూడా అదే పద్ధతిని అనుసరిస్తూ ఉచిత ఇసుకను అటకెక్కించిందని విమర్శించారు. ఇంకోవైపు సూపర్ సిక్స్ పథకాలకు ముహూర్తాలు నిర్ణయించడం తప్పా ఆచరణలో అడుగులు వేయలేదన్నారు. ఇసుక లభించక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, చిన్న, మధ్య తరగతి ప్రజలు ఇళ్ల నిర్మాణాలను ఆపేశారన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బడా సుబ్బిరెడ్డి, నాయకులు జగన్మోహన్, బాబ్‌జాన్, రామ్మోహన్, ముస్తాక్, తాజుద్దీన్, తిరుపాల్, శివ, ఆంజనేయులు, రఫీ, శాంతిబాయి, మున్ని, అమ్మాజాన్, అమరావతి, రమణమ్మ, జయశ్రీ పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : ఉచిత ఇసుక పాలసీని అమలు చేసి హామీ నిలబెట్టుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్. బాషా, సిఐటియు నాయకులు జెవి.రమణ, అయూబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ, రవి కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒ మహేష్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డ్‌లో ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని, గృహ నిర్మాణం చేస్తున్న ప్రజలకు ఇసుక అందుబాటులో ఉంచాలని, కార్మికులకు పని కల్పించేలా వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రవాణా ఛార్జీలు నిర్ణయించాలని, ఇసుక దందాను తక్షణమే అరికట్టాలని తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : ప్రజలకు ఉచితంగా ఇసుక అందించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని, కార్మిక సంక్షేమ బోర్డు ను పునరుద్ధరించి కార్మికులకు ఉపాధి కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిలను పరిష్కరించాలని, కార్మికుల వలసలు ఆపాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నియోజకవర్గానికి ఓ ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు రవి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.హనుమయ్య, మండల కార్యదర్శి ఎం.వెంకటేశులు, సిపిఎం మండల కార్యదర్శి వి.రంగ, చేనేత నాయకులు షీలా నారాయణస్వామి, భవన నిర్మాణ కార్మికులు నారాయణ, బాబు, నరసింహులు, రమేష్, నాగరాజు, పాల్గొన్నారు.

ఇసుక ఉచితంగా ఇవ్వాలని కోరుతూ ర్యాలీ చేపట్టిన సిపిఎం నాయకులు

గోరంట్ల : ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మిక సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని మరచి పేదల సొంతింటి కలను నిర్వీర్యం చేస్తోందన్నారు. సంక్షేమ బోర్డులను గాలికి వదిలేసి భవన నిర్మాణ కార్మికులను నట్టేట ముంచుతోంద న్నారు. ప్రస్తుత, గత ప్రభుత్వ విధానాలతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక చిన్నాభిన్నం అయ్యారన్నారు. అనంతరం తహశీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసా య కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, భవన నిర్మాణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొండా వెంకటేశులు, మండల కన్వీనర్ కిరణ్, రామాంజనేయులు, ప్రసాద్, మధు, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : ఇసుకను ఉచితంగా అందజేసి భవన నిర్మాణ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరుతూ సిపిఎం నాయకులు తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సిపిఎం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సిఎం చంద్రబాబు ఉచితంగా ఇసుకను అందజేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, రామచంద్ర, సుధాకర్, మంజునాథ్, నరసింహ, అశ్వర్థరెడ్డి, షమీ, నరసింహప్ప, అంజి, ఆదిమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : ప్రతి నియోజకవర్గంలో ఇసుక రీచ్ పాయింట్ ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా ఇసుక అందజేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు వేయాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ. 1500, రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, పోతలయ్య, వెంకటనారాయణ, నౌషాద్, బాబాఫకృద్దీన్, బాబు, టైలర్ ముత్తు పాల్గొన్నారు.

గోరంట్లలో తహశీల్దార్ మారుతికి వినతిపత్రం ఇస్తున్న భవన నిర్మాణ కార్మిక, వృకాసం నాయకులు,

కదిరిలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

చిలమత్తూరులో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-హిందూపురం

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

హిందూపురం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు శానిటేషన్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఇంజనీరింగ్, పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, శాశ్వత పారిశుద్ధ్య కార్మికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా పరిశుభ్రత చర్యలను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. అదే విధంగా కార్మికులకు అవసరమైన పనిముట్లను సమకూర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సేకరించిన చెత్తను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రస్తుతం ఉపయోగిస్తున్న ట్రాక్టర్లు సరిపోవడం లేదని అధికారుల ద్వారా తెలుసుకున్న కమిషనర్ మరో మూడు ట్రాక్టర్లను సమకూర్చాలని, మరమ్మతులకు గురైన వాహనాలను వెంటనే రిపేరు చేయించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో మున్సిపల్ ఇంజనీర్ విశ్వనాథ్, డీఈలు బాలసుబ్రమణ్యం, మోహన్, వాణి, ఏఈ జనార్ధన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శంకర్, నిజాం పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేలకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం



మంత్రిని సన్మానిస్తున్న పురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

జిల్లా విజన్ ప్లాన్ పై శుక్రవారం పుట్టపర్తిలో జరిగిన సమావేశంలో పాల్గొన్న సత్యసాయి జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘం అధ్యక్షులు బైసాని రాంప్రసాద్, సభ్యులు మిస్రిమల్, రాజేంద్ర జిల్లా విజన్ పై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇదే సందర్భంలో మంత్రి సవితమ్మతో పాటు జిల్లా కలెక్టర్ చేతన్, కదిరి, పుట్టపర్తి ఎమ్మెల్యేలు కందికుంట ప్రసాద్, సింధూరి రెడ్డిని వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం కొటిపి పంచాయతీ పరిధిలోని బసవేశ్వర కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్రఉపాధ్యక్షులు అరుణాచలరెడ్డి, టీడీపీ కొటిపి ఇన్చార్జి ఉమాశేఖర్ రెడ్డి, నాయకులు రవి, చింతా మంజునాథ్, శీన, గాజుల వెంకటేసులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

యువతకు ఉపాధి కల్పించడానికి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాల్సిన అవస రం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఆమె శుక్రవారం పుట్టపర్తిలో విలేకరులతో మాట్లాడుతూ అధికారుల సమన్వయ లోపంతో పరిశ్రమల అభివృద్ధి ముందుకు సాగడం లేదన్నారు. ఇకనైనా కప్పలబండ వద్ద ఏర్పాటుచేసిన పారిశ్రామికవాడను మరింత అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించాలని, అమడగూరులో సోలార్ యూనిట్, ఒడి చెరువులో జీన్స్, కొత్తచెరువులో వ్యవసాయ పరికరాల పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. పుట్టపర్తిని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. పుట్టపర్తి విమానాశ్రయ కేంద్రంగా బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడకు విమాన సర్వీసులు నడపడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాను ఐటి హబ్‌గా తీర్చిదిద్దితే యువత వలస వెళ్లకుండా ఇక్కడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. నియోజకవర్గంలోని 195 చెరువులను హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలతో నింపాలని కోరారు. నవంబర్ 23వ తేదీ పుట్టపర్తిలో సత్య సాయిబాబా జన్మదిన వేడుకలను ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి భూ సేకరణ చేపట్టి పనులు త్వరగా జరిగేలా చూడాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పుట్టపర్తి జిల్లా కేంద్రానికి అనుసంధానం చేస్తూ జాతీయ రహదారుల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ధర్మవరం-పుట్టపర్తి, మలకవేముల-కొక్కంటి క్రాస్, కొత్తచెరువు-పెనుగొండకు జాతీయ రహదారుల నిర్మాణంతో పాటు పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలను కలుపుతూ రింగ్ రోడ్డు ఏర్పాటుకు అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరారు. జిల్లాలో డ్రోన్ల పరిశ్రమ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అటవీ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా విత్తనాలు చల్లి పచ్చదనం పెంపొందించాలన్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా రైతులకు గడ్డి విత్తనాలు అందించి పశుగ్రాసం పెంపొందించేలా చూడాలన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని, టమోటా రైతులను ఆదుకునేందుకు టమోటా యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రైతులు, ఇతర రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

గర్భిణులకు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని డాక్టర్ ప్రియాంక సూచించారు. స్థానిక కొత్తపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో 35 మంది గర్భిణులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. మానవతా సంస్థ ఛైర్మన్ తల్లం నారాయణమూర్తి, కార్యదర్శి మంజునాథ్, ఉపాధ్యక్షులు జగ్గా వేణుగోపాల్, కోశాధికారి చంద్రశేఖర్, డైరెక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ గర్భిణులు మానసిక ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులదే అన్నారు. వైద్యుల సూచన మేరకు ప్రతి నెలా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవా లన్నారు. వైద్యుని సలహాలు, సూచనలతో ప్రశాంతమైన జీవితాన్ని కొనసాగించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మానవతా సంస్థ సభ్యులతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల వ్యాప్తంగా ప్రజలు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రమేష్ బాబు సూచించారు. ఎస్ఐ శుక్రవారం మండలంలోని నడింపల్లి పంచాయతీ గ్రామమైన పోలేపల్లిలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం పాడవడంతో పాటు గ్రామాల్లో ఘర్షణలకు దారి తీస్తాయని కావున ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే సైబర్ నేరగాళ్లు ప్రజలను ఎలా మోసం చేస్తారు, సైబర్ మోసాలు ఎలా ఉంటాయి, తదితర అంశాలను ప్రజలకు తెలిపారు. ఎవరైనా పోలీసుల హెచ్చరికలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి-హిందూపురం ప్రధాన రహదారిలో శుక్రవారం కారు, బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. వైసిపి నాయకులు కె.సాదత్‌అలిఖాన్ సోదరుడు కె.సమీర్‌ఖాన్ కారులో బెంగళూరు నుంచి కదిరికి వస్తుండగా కారులో బయల్దేరాడు. మార్గమధ్యలో నల్లమాడ మండలంలోని పులగంపల్లి సమీపంలో ఆర్టీసీ బస్సు కారును ఢీ కొంది. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొని గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు.

మాజీ మంత్రిని కలిసిన 'గుండుమల'


దివాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న గుండుమల

మడకశిర రూరల్ : టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి శుక్రవారం మాజీ మంత్రి దివాకర్‌రెడ్డిని అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుండుమల దివాకర్‌రెడ్డి యోగ క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు.

కియా స్టేషన్ ఎస్ఐగా రాజేష్

పెనుకొండ : కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా రాజేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పెనుగొండ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాజేష్ ఎన్నికల అనంతరం జరిగిన బదిలీల్లో భాగంగా కియా స్టేషన్‌కు వచ్చారు.

ఎస్పీని కలిసిన రూరల్ ఎస్ఐ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన లింగన్న శుక్రవారం జిల్లా కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ వి.రత్నను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. అంకితభావంతో పనిచేసి పోలీస్ ప్రతిష్టను మరింత పెంచేలా చూడాలని ఎస్పీ సూచించారు. అంతకు ముందు లింగన్న పుట్టపర్తి రూరల్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కొత్తచెరువు ఎస్ఐగా పనిచేశారు. నల్లచెరువులో విధులు నిర్వహిస్తుండగా బదిలీపై ఇక్కడికి వచ్చారు. తన పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రతా ఏర్పాట్లు నిర్వహిస్తానని ఎస్ఐ తెలిపారు.

ఎస్పీవీఎం డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని ఎస్పీవీఎం డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిగ్రీలో మొదటి సంవత్సరం పూర్తయిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమానికి కరస్పాండెంట్ పెదరాసు సుబ్రహ్మణ్యం, సిఐ శేఖర్ ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. సిఐ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలంటే ఉన్నతమైన వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. తల్లిదండ్రులు మీపై ఉంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకు న్నాయి. క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భక్తవత్సలం, విజయలక్ష్మి, అధ్యాపకులు ఆజాద్, రఘునాథ్‌రెడ్డి, నందగోపాల్, అరవింద్, కవిత, శ్వేత, శాంతి, తదితరులు పాల్గొన్నారు

ఫ్రెషర్స్‌డేలో పాల్గొన్న విద్యార్థులు

నేడు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-అగళి

మండలంలోని మధుడి, ఆర్‌జి పల్లి గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పలు కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని, వారి పర్యటనను జయప్రదం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు కుమారస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.. ముందుగా మధుడి గ్రామంలో ఆర్‌డిటి సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభిస్తారని, అనంతరం ఆర్‌జి పల్లి వెళ్లి గ్రామ సచివాలయాన్ని సందర్శిస్తారని తెలిపారు. వారి పర్యటనలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం కుమారస్వామి కోరారు.

ఇసుక అక్రమ తరలింపు యత్నం.. అడ్డుకున్న ప్రజలు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని మరికొమ్మదిన్నె పంచాయతీలోని ఎర్రవంకవాండ్లపల్లి పరిధిలో కొన్నేళ్లుగా పెద్దఎత్తున ఇసుక డంపింగ్ చేశారు. ఈ డంపు నుంచి కొందరు ఇతర ప్రాంతాలకు చెందిన వారు టిప్పర్లతో ఇసుకను తరలించేందుకు సిద్ధమయ్యారు. ఇది గమనించిన గ్రామస్తులు మా ప్రాంతంలో ఉన్న ఇసుకను ఎలా తరలిస్తారని అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇది గమనించిన పోలీసులు అక్కడికి చేరుకోగా టిప్పర్లు వెనుదిరిగాయి. ఇకనైనా సంబంధిత అధికారులు ఇసుక డంపింగ్ వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితులకు విరాళం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

విజయవాడలోని వరద బాధితుల కోసం పుట్టపర్తి పట్టణ తెలుగు తమ్ముళ్లు రూ. 20వేలు విరాళం ఇచ్చారు. ఆ చెక్కును శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి అందజేశారు. విరాళం ఇచ్చిన సుబ్రమణ్యం మాట్లాడుతూ వరద బాధితుల కోసం తన వంతుగా ఈ సహాయం అందించానన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు శేషు, శామీర్, సాయిప్రసాద్, మాల మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన నూతన అధికారులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం పలువురు అధికారులు బాధ్యతలు స్వీకరిం చారు. ఏవోగా రమణమూర్తి, కోడూరు పంచాయతీ కార్యదర్శిగా భాస్కర్, కొడికొండ కార్యదర్శిగా నాగేంద్ర, సోమగట్ట కార్యదర్శిగా ప్రభుదాస్ బాధ్యతలు స్వీకరించారు. వీరిని మండల సచివాలయ ఉద్యోగులు పూలమాలలతో సత్కరించి స్వాగతం పలికారు. ఏవో రమణమూర్తి, కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ గతంలో మండలంలో పని చేసిన అనుభవంతో గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

తహశీల్దార్‌కు కెవిపిఎస్ నాయకుల సన్మానం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

నూతన తహశీల్దార్ కరుణాకర్‌ను శుక్రవారం జిల్లా కెవిపిఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే, శాలువాతో సత్కరించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వైబి.హళ్లి యోగానంద, రామాంజనేయులు, గోవిందప్ప, చౌడప్ప ఉన్నారు.

అస్వస్థతకు గురైన జింక అటవీ అధికారులకు అప్పగింత

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని ముద్దిరెడ్డిపల్లి గ్రామ పొలాల్లో అస్వస్థతకు గురై పడి ఉన్న జింకను స్థానికులు అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. గ్రామానికి చెందిన రైతు బాలాజీ శుక్రవారం పొలం పనులకు వెళ్లగా అక్కడ జింక పడిపోయి ఉండటం గమనించాడు. అతడు స్పెషల్ బ్రాంచి జమేదారు జయరామ్ నాయక్‌కు సమాచారం ఇవ్వగా ఆయన విఆర్‌ఒ, ఫారెస్ట్ అధికారులకు విషయం తెలిపారు. దీంతో వారు అక్కడికి చేరుకొని జింకను స్వాధీనం చేసుకొని ఆసుపత్రికి తరలించారు. జింక కళ్లు కనిపించక అస్వస్థతకు గురై పడిపోయినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

బిసి రక్షణ చట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం తక్షణమే బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలని బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. చింతా నాగరాజు మాట్లాడుతూ కులగణన చేయాలని, బిసిలకు భవనం నిర్మించాలని, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీల మాదిరిగా బిసిలకు రక్షణ చట్టం, తదితర అంశాలను ఎమ్మెల్యే కందికుంట దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే బిసి రక్షణ చట్టం తెస్తామని, బిసిలకు ప్రత్యేకంగా స్థలం కేటాయించి భవనం నిర్మిస్తామని సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, శ్రీనివాసులు, రామ్మోహన్, గోపాల్, మునుస్వామి, అనిల్, జయరాజ్, శంకర్‌నారాయణ, రాజు, రమణ పాల్గొన్నారు.

ప్రమాద బాధితునికి మంత్రి ఆర్థికసాయం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని ఆర్.లోచర్ల గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు శ్రీరాములు ఇటీవల మండలంలోని కంచెసముద్రం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత ఆర్.లోచర్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకుల ద్వారా రూ. 80వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి హనుమంతరాయుడు, నాయకులు మురళి, ముత్యాలు, రామంజి, రామకృష్ణ, పాల్గొన్నారు.

'బిఎస్ఎన్ఎల్' సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ వ్యాప్తంగా బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అనంతపురంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఎజిఎంను కలిసి విన్నవించారు. మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 80 గ్రామాల్లో బిఎస్ ఎన్ఎల్ సిగ్నల్ సమస్య ఉండడం వల్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే టవర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎజిఎం బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల సమస్యను వెంటనే పరిష్కరిస్తామని తెలిపినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మీడియా కో ఆర్డినేటర్ రవికుమార్ పాల్గొన్నారు.


బిఎస్ఎన్ఎల్ ఎజిఎంకు సమస్యను వివరిస్తున్న గుండుమల

కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ సమీపంలోని మధుగిరి తాలూకాలో ఉన్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం బెంగళూరులో ధర్నా నిర్వహించినట్లు తాలూకా అధ్యక్షుడు గౌడప్ప తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు తెలియజేసినా నిమ్మకు నీలెత్తినట్లు వ్యవహరించడంతో విధి లేని పరిస్థితిలో తమ సమస్యల పరిష్కారానికి బెంగళూరులో ధర్నా చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం దిగిరాని పక్షంలో దశల వారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని గౌడప్ప తెలిపారు.

ధర్మవరంలో లేబర్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలో లేబర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆర్‌డిఒ మహేష్‌కు వినతి పత్రం అందజేశారు. సిఐటియు నాయకులు జెవి రమణ, పెద్దన్న, ఎస్‌హెచ్ బాషా, అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ గతంలో ధర్మవరంలో లేబర్ ఆఫీస్ ఉండేదన్నారు. జిల్లా విభజన జరిగిన తరువాత కొత్తచెరువుకు బదిలీ చేయడం తగదని అధికారులు, కలెక్టర్‌కు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మవరంలో 50వేల మంది కార్మికులున్నారని, కావున ఇక్కడే లేబర్ ఆఫీస్ ఉండేలా చర్యలు చేపట్టాలని, లేనిచో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఆర్‌డిఒ మహేష్‌కు వినతి పత్రం సిఐటియు నాయకులు

మనస్థాపంతో వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-పెనుకొండ

భూ సమస్యతో తీవ్ర మనస్థాపానికి గురైన వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం పెనుకొండ పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. పెను కొండకు చెందిన షేక్ రఫిక్‌బాషా(67) ఆర్టీసీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ రిటైర్డ్ అయ్యారు. ఆయన గోరంట్ల మండలంలో ఉన్న తన 90 సెంట్ల భూమిని కణేకల్లుకు చెందిన ఆసియాభాను నుంచి రూ. 10 లక్షల అడ్వాన్స్ తీసుకొని అగ్రిమెంట్ చేశారు. ఈ భూమి అప్పటికే కోర్టులో ఉండడంతో రిజిస్ట్రేషన్ కాలేదు. దీంతో ఆసియాభాను, ఆమె అన్న విశ్రాంత ఎస్ఐ ఇక్బాల్‌బాషా సాయంతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై గురువారం గోరంట్లలో విచారణ చేశారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన షేక్ రఫిక్‌బాషా పెనుకొండ మార్కెట్ యార్డులో ఉన్న షెడ్డులో శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంటర్నషిప్ ట్రైనింగ్ క్లాసులను శుక్రవారం ప్రారంభించారు. ట్రైనింగ్ క్లాసులు వారం రోజులు జరుగుతాయని హెచ్‌ఎం ఎ.నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ 'విద్యార్థులకు ఈ ట్రైనింగ్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని, ఇందులో ఆచరణాత్మక జ్ఞానం నేర్చుకుంటారన్నారు. విద్యార్థి దశలోనే పని చేయడం, సంబంధిత సృజనాత్మక జ్ఞానాన్ని సంపాదించుకోవడం విద్యార్థి జీవిత కాలానికి ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల స్థాయిలో ఈ రకమైన సబ్జెక్టులు నేర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయులు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి ఆర్టీసీ బస్సు పాసులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ప్రయాణికులు, విద్యార్థులకు ఈ నెల 7వ తేదీ నుంచి బస్సు పాసులు ఇస్తామని శుక్రవారం జిల్లా ఆర్టీసీ రవాణా శాఖ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. సాఫ్ట్‌వేర్ నవీకరణ చేసే క్రమంలో 5, 6 తేదీల్లో బస్సు పాసులు ఇవ్వడానికి వీలులేదన్నారు. 7వ తేదీ నుంచి ఆర్టీసీ కౌంటర్‌లో పాసులు పొందవచ్చని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

హిందూపురం : హిందూపురం మున్సిపల్ పరిధిలోని కొట్నూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదేళ్ల బాలుడు మృతిచెందాడు. పరిగి మండలం కోనాపురానికి చెందిన దంపతులు తమ ఐదేళ్ల చిన్నతో కలిసి ఆటోలో హిందూపురం వస్తుండగా సిరా జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు ఆటోలో నుండి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.